సాక్షి ప్రకాశం

సోమవారం । 12 । ఆగస్టు । 2024



క్షణికావేశం..జీవితం సమాప్తం

పెద్దదోర్నాల మండల పరిధిలో ఉన్న నల్లమల అడవిలో గత రెండేళ్లలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురు ఆత్మహత్య చేసుకున్నారు. - 8లో..



ముస్లింలను ఇబ్బంది పెట్టేందుకే వక్ఫ్ సవరణ బిల్లు

ముస్లింలను ఇబ్బంది పెట్టేందుకే వక్ఫ్ సవరణ బిల్లు కేంద్రం తీసుకొచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ విమర్శించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 36/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

చెన్నైలో ఘోర రోడ్డు ప్రమాదం.. పొదిలి యువకుడికి గాయాలు

- తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చైతన్య
- జిల్లాకు చెందిన ఐదుగురు మరణించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో ఉలిక్కిపడ్డ ఒంగోలు

ఒంగోలు టౌన్:

తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా తిరుత్తణికి సమీపంలో తిరుపతి–చెన్నై సమీపంలో రామంజేరి గ్రామం వద్ద ఆదివారం రాత్రి సంభవించిన ఘోర రోడ్డు ప్రమాదంలో చెన్నైలో బీటెక్ చదువుకుంటున్న ఐదుగురు విద్యార్థులు మరణించారు. అదే ప్రమాదంలో పొదిలికి చెందిన చైతన్య(21) తీవ్రంగా గాయపడ్డాడు. చైతన్యతో పాటుగా నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన విష్ణు కూడా గాయాలయ్యాయి. సరిగ్గా రాత్రి 7 గంటల సమయంలో చెన్నై వైపు వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా సరుకుల లోడుతో వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయిపోయింది. కారులో ఉన్న విద్యార్థుల్లో ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరికి తీవ్రమైన గాయాలయ్యాయి. వారిని వెంటనే 108 వాహనంలో తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరంతా చెన్నై శివారులోని ఎస్ఆర్ఎం కళాశాలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నట్లు తమిళనాడు పోలీసులు గుర్తించారు. తిరువణ్ణామలై, కాణిపాకం ఆలయాలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇదిలా ఉండగా.. ఒంగోలుకు చెందిన ఐదుగురు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో జిల్లా ప్రజలు ఉలిక్కిపడ్డారు. కానీ మృతుల్లో తిరుపతికి చెందిన ఇద్దరు, తమిళనాడుకు చెందిన ఒక విద్యార్థి ఉన్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మిగిలిన ఇద్దరు మృతుల వివరాలు సేకరించే ప్రయత్నంలో తమిళనాడు పోలీసులు ఉన్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

కొయ్.. కొయ్ పేక వెయ్.. వెయ్ ముక్క



పేకాట..నిమిషాల్లో బతుకు చిత్రాన్ని తలకిందులు చేస్తోంది. పచ్చని కాపురాలను కూల్చేస్తోంది. జూదం మహమ్మారి సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోంది. వందలు..వేలు..పందెంగా పెడుతున్నారు. కష్టపడి సంపాదించినదంతా పోగొట్టుకుంటున్నారు. ఈ జూదం మహమ్మారి అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే జోరుగా సాగుతోంది. పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. పేకాట పాపారావులకు నిర్వాహకులు సకల వసతులు సమకూరుస్తున్నారు.

- ఊరూరా పేకాట పాపారావులు
- జిల్లాలో విచ్చల విడిగా పేకాట కేంద్రాలు
- జూదరులకు డ్రింక్, బిర్యానీ..కోరినవన్నీ
- పాడుబడిన భవనాలు.. చెట్ల పొదలే శిబిరాలు
- నిన్నటి వరకు చాటుమాటుగా సాగిన జూదం
- కూటమి ప్రభుత్వంలో బహిరంగ రహస్యంగా పేకాట
- పోలీసులకు కాసులు కురిపిస్తున్న మూడు ముక్కలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో ఎటుచూసినా పేకాట అడ్డాలే. నిరాటంకంగా పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. మూడు రాజులు ..ఆరు రాణులు అన్న చందంగా సాగుతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజల ఇళ్లను గుల్ల చేస్తున్న పేకాటను కట్టడి చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. దీంతో పేకాట శిబిరాల జాడ లేకుండా పోయింది. 60 రోజుల క్రితం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హయాంలో అసాంఘిక కార్యకలాపాలు అదుపు తప్పాయి. శాంతి భద్రతలు అటకెక్కాయి. ఇదే అదనుగా పేకాటరాయుళ్లు రెచ్చిపోతున్నారు. గ్రామ శివారు ప్రాంతాలు, పాడుబడిన దేవాలయాలు, పాత భవనాలు, చెరువులు, దిబ్బలు, పొగాకు గోడౌన్లు, మట్టిదిబ్బలను పేకాట శిబిరాలుగా మార్చుకున్నారు. స్థానికంగానే కాకుండా ఇతర గ్రామాలు, జిల్లాల నుంచి సైతం జూదరులు జిల్లాకు వచ్చి పేకాటాడుతున్నారు. ఈ దందా అధికార పార్టీ నేతల అండదండలతో జోరుగా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనిగిరిలో కాయ్ రాజా కాయ్...

కనిగిరి నియోజకవర్గం సీఎస్‌పురం, పామూరు, పీసీపల్లి శివార్లలో పేకాటరాయుళ్లు ముక్కలు మారుస్తున్నారు. పామూరు, వింజమూరు గ్రామ శివారు ప్రాంతాల్లో కూడా జూదం ఎక్కువగా కొనసాగుతోంది. కందుకూరు, కనిగిరి నియోజకవర్గాల సరిహద్దులు, రెండు జిల్లాల పరిధిలో వచ్చే గ్రామాల్లో ఎన్నుకొని పేకాటాడుతున్నారు. పోలీసులు ఎవరైనా వస్తే చాకచక్యంగా పక్క జిల్లా పరిధిలోకి జారుకుంటున్నట్లు సమాచారం.

పేకాటకు కేరాఫ్ కొండపి...

జిల్లాలో పేకాటకు కొండపి నియోజకవర్గం కేరాఫ్‌గా మారిందన్న ప్రచారం జోరుగాసాగుతోంది. మండల కేంద్రమైన టంగుటూరులోని అగ్నిమాపక కేంద్రం సమీపంలోని పొగాకు గోడౌన్లలో పేకాట జోరుగా సాగుతోంది. దీంతో పాటుగా మరో రెండు పొగాకు గోడౌన్లలో పేకాట శిబిరాలు నడుస్తున్నాయని సమాచారం. టంగుటూరు మండలంలోని కందులూరు, మర్లపాడు మధ్య గ్రావెల్ దిబ్బలపై కోత ముక్కలాట భారీగా జరుగుతోంది. ఈ ఒక్క చోటే ప్రతిరోజు సుమారు రూ.50 లక్షలు వరకు పేకాట సాగుతోందంటే ఇక్కడ ఆట ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. అధికార పార్టీకి చెందిన కీలక నాయకుడి సమీప బంధువు కనుసన్నల్లోనే టంగుటూరు పరిసరాల్లో పేకాట దందా నడుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్రిపూడి మండలంలోని శివరాయునిపేట, జగ్గరాజుపాలెం గ్రామాల సరిహద్దుల్లో కోత ముక్కలు జోరందుకున్నాయి. జరుగుమల్లి మండలంలో కూడా జూదగాళ్లు పేకముక్కలతో చెలరేగిపోతున్నారు. జరుగుమల్లి, పొన్నలూరు సరిహద్దు గ్రామాలు, గ్రామ శివారు ప్రాంతాలు పేకాటకు ఆవాసాలుగా మారాయని చెబుతున్నారు. కొండపి, పొన్నలూరు సరిహద్దుల్లో భారీగా పేకాట జరుగుతున్నట్లు సమాచారం. సింగరాయకొండ మండలంలోని పాత సింగరాయకొండ, సోమరాజుపల్లి గ్రామ సరిహద్దులు, పారిశ్రామిక వాడల్లో పేకాట పాపారావులు ఎక్కువై పోయారు. శానంపూడి పంచాయతీ పరిధిలోని మామిడి తోటల్లో భారీగా జూదం నడుస్తున్నట్లు సమాచారం.

ఒంగోలు నడిబొడ్డున జోరుగా ...

జిల్లా కేంద్రమైన ఒంగోలు నడిబొడ్డున జోరుగా పేకాట సాగుతున్నట్లు సమాచారం. నగరంలోని ప్రధాన వ్యాపార కూడలి గాంధీరోడ్డులోని ఒక బేకరీ పక్క వీధిలో కోత ముక్కలు ఆడుతున్నట్లు సమాచారం. ఇందుకుగాను ఇళ్లు అద్దెకు తీసుకొని మరీ నిర్వాహకులు పేకాటాడిస్తున్నట్లు తెలుస్తోంది. దశరాజుపల్లి దారిలోని ఒక పాత భవనంలో పేకాటాడిస్తున్నట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. కొత్తపట్నం, ఈతముక్కల, కొప్పోలు, వలేటివారిపాలెం, ఏడుగుండ్లపాడు, సీతారాంపురం గ్రామ శివారుల్లో పేకాట జోరుగా సాగుతోంది. నగరంలోని లారీ యూనియన్ ఆఫీసులు, లారీస్టాండ్లు, హోటళ్లు, లాడ్జిలు జూదగాళ్లకు అడ్డాగా మారిపోయాయి. ప్రకాశం కాలనీలో అధికార పార్టీ యువనాయకుడు ఒకరు పేకాటాడిస్తూ రెండు చేతులా సంపాదించుకుంటున్నాడని ప్రచారం.

పోలీసులకు ప్రధానా దాయంగా పేకాట శిబిరాలు

పేకాట శిబిరాలు పోలీసులకు ప్రధాన ఆదాయ వనరుగా మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెలా పోలీసులకు మామూళ్లు అందిస్తారని, అందుకే పోలీసులకు ఈ పేకాట శిబిరాల సంగతి తెలిసినా తెలియనట్లు నటిస్తుంటారని ప్రచారం సాగుతోంది. బంగినిలో ఆటాడేందుకు వచ్చే వారంతా డబ్బు, పరపతి కలిగిన వారే కనుక వారిపై రైడింగ్ జరగకుండా పోలీసులకు భారీగానే ముట్టచెబుతారని ఆరోపణలు ఉన్నాయి. యర్రగొండపాలెం ప్రాంతంలో పట్టుబడిన ఒక నిర్వాహకుడు ఏ పోలీసుకు ఎంతిచ్చాడో, ఏ మీడియా ప్రతినిధికి ఎంతిచ్చాడో లెక్కలు చెప్పడం గతంలో పెద్ద సంచలనంగా మారింది. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది.


ఆట లెక్కన రుసుం..

ఈ పేకాట నిర్వహించే శిబిరాలను బంగిని అని పిలుచుకుంటారు. ఇక్కడ ఆట ఆడినందుకు ఆట లెక్కన రుసుం వసూలు చేస్తుంటారు. ఈ బంగినిలో ప్రతిదీ వ్యాపారమే. ఇక్కడికి వచ్చే వారికి నిర్వాహకులు సకల సేవలు అందిస్తుంటారని తెలిసింది. అవసరమైతే కస్టమర్లను ఇంటికి వచ్చి పిలుచుకొనిపోతారు. ఆట అయిపోయాక ఇంటికి తెచ్చి విడిచి పెడతారు. ఆట మధ్యలో డబ్బులు అయిపోతే అక్కడే అప్పు ఇచ్చే సౌకర్యం కూడా ఉంటుందట. పేకాట మధ్యలో తాగేందుకు కూల్‌డ్రింక్, బిర్యానీ, స్నాక్స్‌ను అందుబాటులో ఉంచుతారు. ఇవన్నీ బజారులో కంటే రెండింతల ధరలకు విక్రయిస్తుంటారని సమాచారం. ఇక్కడ ప్రతి రెండు గంటలకు పేకలను మారుస్తుంటారని తెలుస్తోంది. పోలీసులు రైడింగ్ చేయకుండా నిర్వాహకులే మేనేజ్ చేయడం ప్రత్యేకత.

యర్రగొండపాలెంలో అచ్చు బొమ్మ..

యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురం, గండిచెరువు, ఎలకచెట్టు నుంచి నడిగడ్డ వెళ్లే దారిలో భారీగా పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. ఈ శిబిరాల్లో రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు సమాచారం. పుల్లలచెరువు మండలంలో పేకాట, కోత ముక్కలు ఎక్కువగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. పల్నాడు జిల్లా సరిహద్దుల్లో ఉండడంతో ఇక్కడ పేకాట ఆడేందుకు వినుకొండ, మాచర్ల, గురజాల నుంచి జూదగాళ్లు వస్తుంటారని తెలుస్తోంది. త్రిపురాంతకంలో కూడా వినుకొండ నుంచి నిర్వాహకులు వచ్చి పేకాటాడిస్తున్నట్లు సమాచారం. పేకాటతో పాటుగా అచ్చుబొమ్మ ఎక్కువగా ఆడుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం ఇటువైపు తొంగి చూడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. నెలవారీ మామూళ్లే దీనికి కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శుభ శ్రావణం



ముస్తాబైన పెళ్లి మండపం

శుభశ్రావణం వచ్చేసింది. వివాహ బంధంతో ఒక్కటవ్వాలనుకున్న జంటలకు శుభఘడియలు వచ్చాయి. మూడు నెలల సుదీర్ఘ విరామం తరువాత ఈ నెలలోనే మంచి ముహూర్తాలు ఉండటంతో పెళ్లి బాజాలు మోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివాహాలు, గృహప్రవేశాలు చేయాలనుకునే వారు నూతన వస్త్రాలు, బంగారు ఆభరణాలు, ఇతర సామగ్రి పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తుండటంతో వ్యాపార సముదాయాలూ కళకళలాడుతున్నాయి.

- మూడు నెలల విరామం అనంతరం వివాహ శుభకార్యాలు
- ఒక్కటి కానున్న వేలాది జంటలు
- పురోహితులు, కల్యాణ మండపాలకు పెరిగిన డిమాండ్
- పెళ్లిళ్లతో పాటు గృహప్రవేశాలకూ మంచి ముహూర్తాలు
- కళకళలాడుతున్న వ్యాపార సముదాయాలు

ఒంగోలు మెట్రో: వేదమంత్రాల మధ్య ఒకటవుతున్న నూతన జంటలకు శ్రావణమాసం స్వాగతం పలుకుతోంది. వైశాఖం, జ్యేష్టం, ఆషాఢం, మూడు నెలల విరామం అనంతరం శుభకార్యాలకు శుభ ముహూర్తాలు వచ్చాయి. మే నెల చైత్రమాసం బహుళ చతుర్దశి 7వ తేదీ నుంచి మొదలైన గురు మూఢమి జూన్ నెల జ్యేష్ట మాసం 7వ తేదీ వరకు ఉంది. జూన్ 8వ తేదీ నుంచి జూలై 7వ తేదీ వరకు శుక్ర మూఢమి, జూలై నెల 6వ తేదీ నుంచి ఆషాఢ మాసం మొదలైంది. ఆషాఢం ముగిసి శ్రావణమాసం రావడంతో మూడు నెల విరామం అనంతరం జిల్లా వ్యాప్తంగా భారీగా పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న శుభ ఘడియలు రానే వచ్చాయి. శ్రావణమాసంలోనే జిల్లాలో మూడు వేలకు పైగా జంటలు దంపతులుగా ఒక్కటి కానున్నారు. తమ పిల్లలను ఓ ఇంటి వారిని చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 6 ఆరో తేదీ నుంచి మొదలై నెల చివరి వరకు మంచి ముహూర్తాలు ఉండడంతో శుభకార్యాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కళకళలాడుతున్న వ్యాపార సముదాయాలు:

శ్రావణమాసంలో అనేక ముహూర్తాలు ఉండడంతో వారం రోజులుగా ఒంగోలు నగరంలోని వస్త్ర దుకాణాలు, బంగారు దుకాణాలు, వ్యాపార సముదాయాలు కొనుగోలుదారులతో సందడి వాతావరణం నెలకొంది. వస్త్ర దుకాణాల వారు కొనుగోలుదారులకు భారీ ఆఫర్లు ప్రకటించడంతో మహిళలు పెద్ద సంఖ్యలో కొనుగోలు చేయడానికి వస్తున్నారు. బంగారు దుకాణాలు, వివాహ సామగ్రి షాపులు, బ్యూటీ పార్లర్లు పెళ్లి వారితో కళకళలాడుతున్నాయి. నగరంలో కళ్యాణ మండపాలకు మంచి గిరాకీ ఏర్పడింది. పెద్ద కళ్యాణ మండపం ఏసీ ఫంక్షన్ హాల్‌కు సుమారు లక్షన్నర, నాన్ ఏసీ చిన్న కళ్యాణ మండపాలకు అన్ని మెయింటినెన్స్ చార్జీల కింద రూ.65 వేలు వసూలు చేస్తున్నారు. నెల రోజుల ముందు నుంచే కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్‌లు బుక్ అయిపోయాయని కళ్యాణ మండప నిర్వాహకులు తెలిపారు. కళ్యాణ మండపాన్ని బట్టి పెళ్లి యజమానుల వారి నిర్ణయాన్ని బట్టి డెకరేషన్‌కి రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు తీసుకుంటున్నామని డెకరేషన్ నిర్వాహకులు తెలిపారు. కళ్యాణ మండపంలో జరిగే ఈవెంట్స్ కి సుమారు రూ.25 వేల నుంచి లక్ష రూపాయల దాకా వసూలు చేస్తున్నారు. పెళ్లికి వీడియో ఫొటోలకు కలిపి రూ.30 వేలు, ఫొటోలకు కరిష్మా ఆల్బమ్ అయితే లక్ష రూపాయల దాకా తీసుకుంటున్నారు. శ్రావణమాసం పండగలు, వ్రతాలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో వేద పురోహితులకు, ప్రింటింగ్ ప్రెస్, దుస్తుల దుకాణం, పూల వ్యాపారులకు, క్యాటరింగ్ వంటలు చేసే వారికి, బ్యాండ్ మేళం, సన్నాయి వాయిద్యాలకు, టెంట్ హౌస్ పందిళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది.

డెకరేషన్‌కు ఒక్కో కల్యాణ మండపానికి ఒక్కో రేటు



మూడు నెలల తర్వాత ఆగస్టు నెలలో శుభకార్యాలు ఉండడంతో నగరంలోని ఒక్కొక్క కళ్యాణ మండపాన్ని బట్టి పెళ్లి నిర్వాహకుల ఆర్థిక స్థోమతను బట్టి రూ.15 వేల నుంచి రూ.లక్ష యాభై వేలు వరకు తీసుకుంటున్నాం.

– డెకరేషన్ నిర్వాహకుడు, కుంచాల సాయి మహేష్

మూడు నెలల తరువాత వివాహ శుభకార్యాలు



గురు, శుక్ర మూఢములు, ఆషాఢం ఇలా.. మూడు నెలల అనంతరం శ్రావణ మాసంలో అధిక వివాహ శుభకార్యాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం శ్రావణ మాసంలో 7, 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24,25, 28 ఈ తేదీలో అనుకూలమైన మంచి ముహూర్తాలు, వివాహ శుభకార్యాలకు ఉన్నాయి. గృహ ప్రవేశాలకు 8, 9, 11, 17, 20, 22, 23, 28, గృహారంభం 6, 8, 9, 10, 15, 18, 22, 23, 24, 28 శుభ ముహూర్తాలు ఉన్నాయి. ముఖ్యంగా ఈనెల 16, 17,19 చాలా బలమైన ముహూర్తాలు.

– భారతుల శ్రీనివాస శర్మ, ప్రముఖ వేద పురోహితులు

కల్యాణ మండపాలకు మంచి గిరాకీ



మూడు నెలలు శుభకార్యాలు లేకపోవడంతో శ్రావణమాసంలో కళ్యాణ మండపాలకి మంచి గిరాకీ ఏర్పడింది. ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర చెరువు ఫ్యాన్సీ గూడ్స్ అసోసియేషన్ మా కళ్యాణ మండపానికి రూ.15 వేలు, ఫంక్షన్ హాల్ కి ఏసికి రూ.7 వేలు, కింద హాల్‌కి రూ.4 వేలు, మెయింటినింగ్ చార్జి రూ.7 వేలు వసూలు చేస్తున్నాం.

– రామకృష్ణ, ఫ్యాన్సీ గూడ్స్ అసోసియేషన్ కళ్యాణ మండపం మేనేజర్

చదువులో అంగన్ వాడీలా



అంగన్‌వాడీ కేంద్రం

గత ప్రభుత్వంలో ప్రణాళికాబద్ధంగా సాగిన సర్కారు విద్యావ్యవస్థ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే గాడితప్పింది. గతంలో జూన్ నెలకే అంగన్‌వాడీల్లోని చిన్నారుల చేతికి కొత్త పుస్తకాల కిట్‌లు చేరేవి. ఈ ఏడాది రెండు నెలలైనా ఇంత వరకు కొత్తపుస్తకాలు రాకపోవడంతో గతంలో ఇచ్చిన వాటితోనే అంగన్‌వాడీ టీచర్లు బోధన కొనసాగిస్తున్నారు.

- రెండు నెలలైనా అంగన్‌వాడీ కేంద్రాలకు అందని పాఠ్య పుస్తకాలు
- పాత పుస్తకాలతోనే విద్యా బోధన
- ప్రైవేటు స్కూళ్ల వైపు మొగ్గు చూపుతున్న చిన్నారుల తల్లిదండ్రులు

జిల్లాలో అంగన్‌వాడీ ప్రాజెక్టులు: 13
అంగన్‌వాడీ కేంద్రాలు: 2,903
6 నెల నుంచి మూడేళ్లలోపు పిల్లలు 58,388
ప్రీస్కూల్ పిల్లలు: 46,392

కనిగిరి రూరల్: బాల్య దశ నుంచే చిన్నారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనేక చర్యలు చేపట్టారు. తత్ఫలితంగా అంగన్‌వాడీల్లో చిన్నారుల సంఖ్య పెరిగింది. అంగన్‌వాడీ బడుల్లోకి చిన్నారులు వచ్చేలా, స్కూల్ పట్ల ఆసక్తి కలిగించేలా ఆటపాటలతో కూడిన విద్య, బొమ్మలున్న పుస్తకాలు అందజేసింది. ఫలితంగా వారు ఎంతో ఉత్సాహంగా అంగన్‌వాడీ బడిబాట పట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది అంగన్‌వాడీలకు అందించాల్సి పాఠ్యపుస్తకాలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. పాత పాఠ్య పుస్తకాలతోనే కాలం గడిపేయాలనే అనధికార ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది సైతం చేసేది ఏమీ లేక పాత పుస్తకాలతో సరిపెడుతున్నారు. జిల్లాలోని 13 ప్రాజెక్టుల పరిధిలో 2,903 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 6 నెల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 58,388 మంది, ప్రీస్కూల్ పిల్లలు 46,392 మంది ఉన్నారు. నియోజకవర్గంలోని కనిగిరి ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల్లో 6 నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు 1075 మంది, 1 నుంచి 3 ఏళ్ల పిల్లలు 3,180 మంది, 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు 4,194 మంది ఉండగా, వెలిగండ్ల ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల్లో 6 నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు 695 మంది, 1 నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలు 2,365 మంది, 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు 2,468 మంది ఉన్నట్లు నివేదికలున్నాయి.

జూన్‌కు రావాల్సినవి.. ఇప్పటి వరకు లేదు:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీలోని చిన్నారుల విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ.. విద్యా సంవత్సరం ప్రారంభమైన జూన్ నెలలోనే 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు ఆంగ్లం, గణితం స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్ కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ 1, కిట్లు, పీపీ 2 కిట్లు అందించేవారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు బొమ్మలతో కూడిన పుస్తకాలను చూపిస్తూ చిన్నారులకు విద్యను బోధించడం సులువుగా ఉండేది. పిల్లలు కూడా ఆసక్తిగా పాఠాలు నేర్చుకునే వారు. అంగన్‌వాడీల్లో ఇంగ్లిషు విద్య బోధన చిన్ననాటి నుంచే జరుగుతుండటంతో ఠంచనుగా అంగన్‌వాడీ కేంద్రాలకు తమ పిల్లలను తల్లిదండ్రులు పంపించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో అంగన్‌వాడీల్లో చిన్నారుల విద్యా బోధన మొక్కుబడి తంతుగా మారింది. కొత్త పుస్తకాలు ఇస్తారో.. లేదో అన్న సందేహంతో చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూల్‌కు పంపేందుకు మొగ్గు చూపుతున్నారు.



పాత పుస్తకాలతోనే చదువుకుంటున్న చిన్నారులు

పాత పుస్తకాలతో బోధిస్తున్నాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాదికి సంబంధించిన కొత్త పాఠ్య పుస్తకాలు ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే ఆయా కేంద్రాలకు అందజేస్తాం. ప్రస్తుతం మా వద్ద ఉన్న పాత పాఠ్య పుస్తకాలతోనే బోధిస్తున్నాం. ప్రతి రోజు టైం టేబుల్ ప్రకారం అన్ని స్కూళ్లలో చిన్నారులకు విద్యా బోధన జరుగుతోంది.

– పి సరోజిని, సీడీపీఓ, కనిగిరి

స్వాతంత్ర్య దిన వేడుకలకు కొండపి రైతు



రైతుకు టికెట్లు అందజేస్తున్న వ్యవసాయ అధికారి డి.విజయ్ కుమార్

కొండపి (సింగరాయకొండ): ఆగస్టు 15న ఢిల్లీలో జరగనున్న స్వాతంత్ర్య దిన వేడుకలకు కొండపి మండలం పెద్ద కల్లగుంట గ్రామానికి చెందిన నల్లపు మాల్యాద్రి ఎంపికైనట్లు మండల వ్యవసాయ అధికారి డి.విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో పీఎం కిసాన్ ద్వారా 17 విడతలకు అన్నిసార్లు అర్హత పొందిన మాల్యాద్రి స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనడానికి ఎంపికయ్యారని అన్నారు. ఢిల్లీ రానుపోను రిజర్వేషన్ చేసిన టికెట్లను ఆదివారం రైతు ఇంటికి వెళ్లి వారికి అందజేశారు. కార్యక్రమంలో పెద్ద కండ్లగుంట గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్.మహేష్ బాబు పాల్గొన్నారు.

ఆ కార్పొరేటర్ మాకొద్దు బాబోయ్..!

- 50వ డివిజన్ కార్పొరేటర్‌ను టీడీపీలో చేర్చుకోవడంపై కార్యకర్తల ఆగ్రహం
- ఎమ్మెల్యే దామచర్ల నిర్ణయంపై నిరసన

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: గత ఐదు సంవత్సరాలుగా టీడీపీ కార్యకర్తలను, నాయకులను తీవ్రంగా వేధింపులకు గురిచేసిన 50 డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావును తెలుగుదేశం పార్టీలోకి ఎలా తీసుకుంటారని, వెంటనే అతడ్ని బయటకు పంపించి వేయాలని కోరుతూ టీడీపీ కార్యకర్తలు, నాయకులు నిరసనకు దిగారు. ఆదివారం రాత్రి వెంకటేశ్వర కాలనీలో సమావేశమైన టీడీపీ కార్యకర్తలు అంబటికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబటిని పార్టీలో చేర్చుకునే ముందు స్థానిక నాయకులతో చర్చించక పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాంబాబుతో కానీ, గత ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయిన హనుమంతరావుతో కానీ మాట మాత్రంగానైనా చెప్పకుండా అంబటి ప్రసాదరావును పార్టీలోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. కార్పొరేటర్‌గా ప్రసాదరావు టీడీపీ, వైఎస్సార్ సీపీ కార్యకర్తలనే కాకుండా చిరువ్యాపారాలు చేసుకునే వారిని కూడా వదిలిపెట్టకుండా వేధించాడని చెప్పారు. స్వార్థ ప్రయోజనాల కోసమే వైఎస్సార్ సీపీలో చేరిన అతడు కార్పొరేటర్‌గా గెలిచి అందినకాడికి దోచుకొని కోటి రూపాయలకు పైగా సంపాదించుకొన్నాడని, అలాంటి అవినీతిపరుడికి పార్టీ కండువా కప్పడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అతడి వలన చాలా ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు టీడీపీలోకి చేర్చుకుంటే మళ్లీ వేధింపులకు గురి చేస్తాడని, అంబటి మాకొద్దు అంటూ తేల్చి చెప్పారు. ఇప్పటికైనా స్థానిక నాయకులతో చర్చించాలని, పార్టీని కాపాడేందుకు అంబటిని బయటకు పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు సీహెచ్ లక్ష్మీ, టీ శ్రీనివాసులు, హనుమంతరావు తదితరులు మాట్లాడారు. పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు హాజరయ్యారు.

క్లుప్తంగా

విద్యుత్‌ తీగలు అపహరించిన వ్యక్తికి దేహశుద్ధి

గిద్దలూరు రూరల్‌: విద్యుత్‌ తీగలు అపహరించిన వ్యక్తికి దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన మండలంలోని వెంగల్‌రెడ్డిపల్లెలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. వెల్లుపల్లె గ్రామానికి చెందిన చిట్టెట్టి లక్ష్మయ్య అనే వ్యక్తి వెంగల్‌రెడ్డిపల్లె గ్రామ పరిధిలోని రైతుల విద్యుత్‌ బోరు తీగలను అపహరించి తీసుకువెళుతుండగా గ్రామస్తులు గుర్తించి అతన్ని పట్టుకుని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం లక్ష్మయ్యను పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్‌ సెంటర్‌లో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మల్లవరం గ్రామానికి చెందిన పోతినేని రామచంద్రరావు గుండ్లాపల్లి గ్రోత్‌ సెంటర్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఒంగోలు వైపు వెళుతున్న కారు ఢీకొట్టడంతో రామచంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108లో ఒంగోలులోని ప్రైవేట్‌ వైద్యశాలకు తరలించారు. ఎస్సై వి.మహేష్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అశ్రునయనాల మధ్య విద్యార్థుల అంత్యక్రియలు

పామూరు: నీటి గుంటలో పడి మృతి చెందిన విద్యార్థుల అంత్యక్రియలు ఆదివారం కుటుంబసభ్యుల అశ్రునయనాల మధ్య నిర్వహించారు. ఈత కొట్టేందుకు వెళ్లిన డీవీపాలెంకు చెందిన పసుపులేటి చరణ్‌(17), విరువూరు రోడ్డుకు చెందిన పసుపులేటి గౌతమ్‌ (15) మృతి చెందారు. కనిగిరిలో మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించారు. అంత్యక్రియల సందర్భంగా కుటుంబసభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రతి ఒక్కరి జీవితంలో సమస్యలు సహజం. కొంత మంది వాటిని ఎక్కువగా ఆలోచించి మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురై క్షణికావేశంలో అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. వారి మరణం ఆ కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తోంది. గత కొన్నేళ్లుగా నల్లమల ప్రాంత పరిసరాలు ఆత్మహత్యలకు కేరాఫ్‌ అడ్రస్‌గా మారాయి. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న నల్లమలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఆత్మహత్య చేసుకోవడం స్థానికులను కలవరానికి గురిచేస్తోంది.

క్షణికావేశం... జీవితం సమాప్తం..!

- ఆత్మహత్యలతో బలవుతున్న నిండు ప్రాణాలు
- నల్లమలలో వరుస సంఘటనలతో ఆందోళన
- ఆచూకీ తెలియని వ్యక్తుల మరణాలతో పోలీసుల పరేషాన్‌
- సమస్యలకు ఆత్మహత్యే పరిష్కారం కాదంటున్న వైద్యాధికారులు



పెద్దదోర్నాల:

క్షణికావేశంతో కొందరు తమ నిండు ప్రాణాలను బలి చేసుకుంటున్నారు. నూరేళ్లు కలిసి జీవించాల్సిన భార్యభర్తల మధ్య అనుమానమనే భూతం అడ్డంకిగా మారుతోంది. దీంతో భార్యభర్తలు తెలిసీ, తెలియని తప్పులను అనుక్షణం గుర్తు చేసుకుంటూ నిస్సహాయ స్థితిలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మనస్సులోని అనుమానాలతో జీవితంలో ఇమడలేని మరి కొందరు అమాయకులు తమ జీవితాలను ఆత్మహత్యలతో ఫుల్‌స్టాప్‌ పెడుతున్నారు. గడిచిన రెండేళ్లలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురు మండల పరిధిలో ఆత్మహత్యలకు పాల్పడటం స్థానికులను కలవరానికి గురిచేస్తుంది.వరుసగా జరుగుతున్న ఆత్మహత్యల పరంపర నేపథ్యంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తుల ఆచూకీ తెలుసుకోవడం పోలీసులకు తలకు మించిన భారంగా మారుతోంది.

బలవన్మరణాలకు కేరాఫ్‌గా నల్లమల

ఆత్మహత్యలకు నల్లమల పరిసర ప్రాంతాలు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. సాధారణంగా నల్లమల అటవీ ప్రాంతంలో యాత్రికుల రద్దీ అధికంగా ఉంటుంది. నల్లమల అందాలను వీక్షించడంతో పాటు ఎన్నో విలువైన విషయాలను తెలుసుకునేందుకు ప్రత్యేకమైన వాహనాల్లో విహారయాత్రలకు తరలి వచ్చే విద్యార్థులు శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు, సరదాగా అటవీ ప్రాంతంలో గడిపేందుకు వచ్చే యాత్రికులతో పాటు నిత్యం వేలాది మంది నల్లమల గుండా ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. ఇలా వచ్చిన యాత్రికులు మనో వేదనతో ఏకాంత ప్రదేశాల్లో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.



అరబిక్‌ స్కూల్‌ వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డ హైదరాబాద్‌ వాసి.....

- 2022 మార్చి 28న పురుగుమందు తాగి అద్దాకుల సురేష్‌ అనే యువకుడు ఆర్టీసీ బస్టాండులోనే మృతి చెందాడు.
- 2022 అక్టోబర్‌ నెల 19వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వేములమందా కృష్ణంరాజు అనే వ్యక్తి సొరంగ నిర్మాణ ప్రాంతం వద్ద పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో పాటు గుంటూరు జిల్లా చెరుకుపల్లికి చెందిన తూనుగుంట్ల పణికుమార్‌ అనే వ్యక్తి తుమ్మలబైలు గిరిజ గూడెం సమీపంలో పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు.
- ఈ నెల 7న కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో జమ్మిదోర్నాలకు చెందిన వడ్డెళ్లి కోటేంద్ర అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇలా క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలతో తమ కుటుంబాలకు తీరని శోకం మిగులుస్తున్నారు.

రెండేళ్లలో మరికొన్ని సంఘటనలు..

- స్థానిక భారత్‌ పెట్రోల్‌ బంక్‌ వెనుక భాగంలో చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులకు ఆ మృతదేహాన్ని కనుగొనడం సవాల్‌గా మారింది.
- అరబిక్‌ స్కూల్‌ వద్ద చెట్టుకు ఉరేసుకొని హైదరాబాద్‌కు చెందిన భాస్కరరావు అనే వ్యక్తి మృతి చెందాడు. సాక్ష్యాలు లేకుండా జాగ్రత్త పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఎలాగోలా అతని ఆచూకీ ఛేదించగలిగారు.
- ఓ వృద్ధుడు యడవల్లి సమీపంలోని హైటెన్షన్‌ విద్యుత్‌ స్తంభానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్న పోలీసులకు ఇంత వరకు అతని ఆచూకీ లభించలేదు. ఇలా ఎందరో అభాగ్యులు ఆత్మహత్యలకు పాల్పడి తమ జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తున్నారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు

చిన్న సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు. మానవ జీవితం ఎంతో ఉన్నతమైంది. సమస్యలు ఎదురైనప్పుడు ఎదురు నిలిచి పోరాడాలి. వాటిని పరిష్కరించే మార్గాలను అన్వేషించాలే తప్ప, పిరికితనంతో ఆత్మహత్యకు పాల్పడటం చాలా తప్పు. ఎన్ని కష్టాలొచ్చినా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలి.

– డాక్టర్‌ శ్రీనివాసులు, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

‘ఓరేయ్‌ శీను ఎలా ఉన్నావ్‌రా..’

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గురువులతో పూర్వవిద్యార్థులు

మార్కాపురం: అప్పట్లో వారంతా నూనూగు మీసాలతో భవిష్యత్‌పై ఆశలతో కాలేజీ వదిలి బయటకు వచ్చారు. మళ్లీ నెరసిన జుట్టు, షష్టిపూర్తికి దగ్గరి వయసులో గుర్తుపట్టలేనంతగా మారిపోయినా ఆనాటి అల్లరి చేష్టలు గుర్తుకు తెచ్చుకొని ఒరేయ్‌... అరేయ్‌... అంటూ పాత రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఇందుకు మార్కాపురం పట్టణంలోని ఒక ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాలు వేదికగా మారింది. పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాలలో 1976, 1979 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో, వృత్తుల్లో స్థిరపడిన వారంతా శనివారం రాత్రే మార్కాపురం పట్టణానికి చేరుకుని ఆదివారం ఉదయం సమావేశంలో ఒకరినొకరు ఆత్మీయ అలింగనం చేసుకొని, తీపి జ్ఞాపకాలను నెమరువేసుకొని కుటుంబసభ్యుల యోగ క్షేమాలు తెలుసుకుని ఆనందపడ్డారు. ఈ కలయికకు ఆనాటి విద్యార్థులు, నేటి పట్టణ ప్రముఖులైన తాడువాయి మల్లిఖార్జునరావు, రమేష్‌ ట్యాంక్‌, మోదాల రమణారావు, ఎంఆర్‌కే జనార్దన్‌, గంగిశెట్టి రాధాకృష్ణ తదితరులు సమావేశాన్ని పర్యవేక్షించారు. 45 ఏళ్ల నాటి తీపిగుర్తులను గుర్తుచేసుకుని ఆనాడు తమకు కామర్స్‌, పాలిటిక్స్‌, ఎకనామీ, బాటనీ, జువాలజీ, ఫిజిక్స్‌ నేర్పిన గురువులైన డాక్టర్‌ ఐ బాలసుబ్బారావు, వి బాలరత్నం, జి.శంకర్‌ నారాయణ, బి.సుందర ప్రసాద్‌, పి.రాధాకృష్ణమూర్తి, టి. కాశీరత్నంలను ఘనంగా సన్మానించి మధుర స్మృతులను మరోసారి గుర్తుకుతెచ్చుకుని సంతోషంగా గడిపారు.

ముస్లింలను ఇబ్బంది పెట్టేందుకే వక్ఫ్‌ సవరణ బిల్లు

- బిల్లును ఉపసంహరించుకోవాలని ముస్లింల డిమాండ్‌



రౌండ్‌టేబుల్‌ సమావేశంలో మాట్లాడుతున్నన సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌ హనీఫ్‌

ఒంగోలు టౌన్‌: ముస్లింలను ఇబ్బంది పెట్టే దురుద్దేశంతోనే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్‌ సవరణ బిల్లును తీసుకువచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌ హనీఫ్‌ విమర్శించారు. ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా వక్ఫ్‌ చట్టంపై ఎలాంటి ఫిర్యాదులు లేకున్నా మతచిచ్చు రగిల్చే కుట్రతోనే ఈ బిల్లును తెస్తున్నారని మండిపడ్డారు. ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వక్ఫ్‌ సవరణ చట్టాన్ని నిరసిస్తూ ఆదివారం ఇస్లాంపేటలో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పెద్దల కనుసన్నలలోనే ముస్లింలపై నిరంతర దాడులు జరుగుతున్నాయని చెప్పారు. గతంలో వక్ఫ్‌ ఆస్తుల నిర్ధారణను వక్ఫ్‌ ట్రిబ్యునల్‌ చేసేదని, ఇప్పుడు కలెక్టర్‌కు అధికారాలు కట్టబెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దొడ్డిదారిన వక్ఫ్‌ మీద అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. నల్లధనం రద్దు చేసేందుకే పెద్ద నోట్లను రద్దు చేసినట్లు చెప్పుకున్నారని, జీఎస్టీ తెచ్చినప్పుడు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని మభ్యపెట్టారని, ఆ తరువాత అవి అబద్ధాలనే తేలాయని, ఇప్పుడు వక్ఫ్‌ చట్టంలో లోపాలను సరి చేస్తున్నామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ముస్లింల హక్కులను కాపాడుతామంటూ ప్రచారం చేసుకున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ముస్లిం వ్యతిరేక వక్ఫ్‌ సవరణ చట్టానికి మద్దతు ఇవ్వడం సమర్ధనీయం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. లక్షలాది ఎకరాల వక్ఫ్‌ భూములను పెద్ద ఎత్తున కబ్జా చేస్తున్నా వాటిని కప్పిపుచ్చుతూ అనేక కట్టుకథలను మీడియా ద్వారా దుష్ప్రచారం చేయడం మానేయాలని, ముస్లింల ఆధ్యాత్మిక వ్యవహారాలలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం మానుకోవాలని, ముస్లిం సామాజిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నవాబులు, రాజులు ఇచ్చిన ఆస్తులపై ప్రస్తుతం వక్ఫ్‌ బోర్డుకు ఉన్న అధికారాలను కొనసాగించాలని సమావేశం తీర్మానం చేసింది. సమావేశానికి సీనియర్‌ నాయకులు సయ్యద్‌ సర్దార్‌ అధ్యక్షత వహించగా న్యాయవాది షేక్‌ కరిముల్లా సమన్వయకర్తగా వ్యవహరించారు. ముస్లిం పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌ ఇస్మాయిల్‌, సయ్యద్‌ హుసేన్‌, ఎంఏ సాలార్‌, మహమ్మద్‌ సాదిక్‌, షేక్‌ ఖాజా, అబ్దుల్‌ రవూఫ్‌, కరీమ్‌ బేగ్‌, న్యాయవాదులు షేక్‌ సందాని, అబ్దుల్‌ నబి, ఆరీఫ్‌ ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలకు సెలవిచ్చేశారు..!

- ఆకవీడు పీహెచ్‌సీ తాళం వేసిన సిబ్బంది



తాళం వేసి ఉన్న ఆకవీడు పీహెచ్‌సీ



ఆదివారంమధ్యాహ్నం వరకు సేవలందుతాయని ఏర్పాటు చేసిన బోర్డు

రాచర్ల: మండలంలోని ఆకవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆదివారం సెలివిచ్చేశారు. దీంతో ఆస్పత్రికి తాళం వేసి కనిపించింది. ఆదివారం, ఇతర ప్రభుత్వ సెలవు దినాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే ఆకవీడు పీహెచ్‌సీ సిబ్బంది మాత్రం ఆదివారం కనీసం ఆస్పత్రి తాళాలు కూడా తీయలేదు. సిబ్బంది ఎప్పుడు వస్తారా అని ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఎదురుచూసిన రోగులు ఎంత సేపటికి ఎవ్వరూ రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఆదివారం పీహెచ్‌సీకి తాళం వేస్తామని ముందుగానే చెబితే తాము ఇంత దూరం వచ్చేవాళ్లం కాదని అక్కడకు వచ్చిన పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

పెద్దదోర్నాల కళాకారుడికి డాక్టరేట్‌

- 15 వేలకు పైగా నాటక రంగ ప్రదర్శనలు
- డాక్టరేట్‌తో సత్కరించిన పాండిచ్చేరి యూనివర్శిటీ..



గౌరవ డాక్టరేట్‌ అందుకుంటున్న శివశంకరాచారి

పెద్దదోర్నాల: మండలంలోని పెద్దదోర్నాలకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, పౌరాణిక కళాకారుడు ముత్తులూరి శివశంకరాచారికి అరుదైన గౌరవం దక్కింది. పాండిచ్చేరికి చెందిన యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ అవార్డును అందజేసి సత్కరించింది. ఈ నెల 10వ తేదీన పాండిచ్చేరిలో యునైటెడ్‌ నేషన్‌ ఇంటర్నేషనల్‌ పీస్‌ కౌన్సిల్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్‌ పీస్‌ కౌన్సిల్‌ అచీవ్‌ అవార్డుతో పాటు గౌరవ డాక్టరేట్‌ అవార్డును కూడా అందజేశారు. మోటార్‌ మెకానిక్‌గా విధులు నిర్వహించే ముత్తులూరి శివశంకరాచారి నాటక రంగంలో దాదాపు 1500 పైగా ప్రదర్శనలిచ్చారు. ముఖ్యంగా బాలనాగమ్మ నాటకంలో మాయలపకీర్‌, భూకైలాస్‌లో రావణబ్రహ్మ, సీతారామ కళ్యాణంలో రావణబ్రహ్మ, మోహినీ భస్మాసురలో భస్మాసురిడిగా సత్యహరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్రుడిగా, వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్రనాటకంలో వీరబ్రహ్మేంద్రస్వామిగా పాత్రలు చేసి అందరినీ మెప్పించారు. ఇతని కళానైపుణ్యతను గుర్తించిన పాండిచ్చేరి యూనివర్శిటీ డాక్టరేట్‌తో సత్కరించారు. యునైటెడ్‌ నేషన్‌ ఇంటర్నేషనల్‌ పీస్‌ కౌన్సిల్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనివర్శిటీ ప్రొఫెసర్లు, వైస్‌ చాన్సలర్లు, రిజిస్ట్రార్ల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. జాతీయ స్థాయిలో 29 మంది నాటక కళాకారులకు డాక్టరేట్‌ అవార్డులు అందజేయగా, అందులో మండలానికి చెందిన శివశంకరాచారి కూడా డాక్టరేట్‌ అందుకోవడం హర్షించదగ్గ విషయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. అవార్డు అందుకున్న శివశంకరాచారి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలలో వివిధ రకాల పాత్రలు ధరించిన తనకు పాండిచ్చేరి యూనివర్శిటీ డాక్టరేట్‌ అవార్డును అందించి సన్మానించటం జీవితంలో మరుపురాని ఘట్టంగా నిలిచిపోతుందని శివశంకరాచారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కృష్ణ బాజీబాబు

కొండపి (సింగరాయకొండ): ట్రాక్టర్‌ తగిలి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని కొండపి–పెద్దకండ్లగుంట గ్రామాల మధ్య ఆదివారం జరిగింది. ఎస్సై కృష్ణబాజీబాబు వివరాల ప్రకారం..కనిగిరి మండలం పెదారికట్ల గ్రామానికి చెందిన కట్టెల ట్రాక్టర్‌ కొండపి మండలం ముప్పవరం గ్రామం వెళ్లేందుకు పెద్దకండ్లగుంట గ్రామం మీదుగా కొండపి వస్తుంది. అదే సమయంలో పెద్దకండ్లగుంట గ్రామానికి చెందిన తంగెళ్ల మరియమ్మ(32) తండ్రి మక్కెన యలమంద ద్విచక్రవాహనంపై ఒంగోలులో చర్చి వెళుతుంది. ట్రాక్టర్‌ డ్రైవర్‌ అజాగ్రత్తగా ఓ పక్కకు తిప్పడంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరూ కిందపడ్డారు. ట్రాక్టర్‌ వెనుక టైర్‌ మరియమ్మపై ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. యలమందకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌ వాహనాలపై పర్యవేక్షణ ఉండాలి



ఏఆర్‌ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్‌

ఒంగోలు టౌన్‌: పోలీసు వాహనాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని వాహనాల పనితీరు, కేటాయింపులపై శ్రద్ధ ఉండాలని ఎస్పీ ఏఆర్‌ దామోదర్‌ ఆదేశించారు. జిల్లా ఆర్మ్‌డ్‌ పోలీసు కార్యాలయాన్ని ఆదివారం సందర్శించిన ఆయన కార్యాలయంలోని వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయుధాగారంలో ఉన్న ఆయుధాలు, మోటార్స్‌ ట్రాన్స్‌పోర్ట్‌ విభాగం , పరేడ్‌ గ్రౌండ్‌, ఏఆర్‌ అడ్మినిస్ట్రేషన్‌ కార్యాలయం, వ్యాయామశాల, బ్యారాక్‌, గార్డ్‌ రూంలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయుధాగారంలోని ఆయుధాలను శుభ్రంగా ఉంచుకోవాలని, బ్యారక్‌ను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వాహనాల లోటుపాట్లను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యాలయంలో కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏఆర్‌ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్‌ డీఎస్పీ చంద్రశేఖర్‌, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, డీసీఆర్‌బీ సీఐ భీమానాయక్‌, ఆర్‌ఐలు రమేష్‌ కృష్ణన్‌, రమణారెడ్డి, సీతారామిరెడ్డి ఉన్నారు.